# చలపాయ్ ప్రేమ కథ

- మల్లాది లక్ష్మీనరసింహం

**చలపతి** ప్రేమించి పెళ్ళి చేసుకో దలిచాడు.

అసలు జీవితంలో పెళ్ళంటూ చేసుకుంటే ప్రేమించే చేసుకుంటానని మొండి కెత్తాడు. అలా మొండి కెత్తడంతో వూరుకున్నాడా అంటే అదీ కాదు. తనకి సంబంధాలు చూస్తున్న తల్లి తండ్రులతోను, ఇతర బంధువర్గంతోనుకూడా కుండ బద్దలు కొట్టినట్లు ఆ మాటే చెప్పేశాడు.

"ఇదేం పోకాలంరా" అని వాపోయింది వాళ్ళమ్మ.

"వీడి కీ జన్మకి పెళ్ళవదు" హుంకరిస్తూ సిగరెట్ పొగ బలంగా విడిచాడు వాళ్ళ నాన్న. ఆయనకు కోపం వచ్చినప్పుడల్లా చేతిలో సిగరెట్టున్నా, లేక పోయినా ఒక సా రళా బుసలు కక్కినట్లు పొగ వదలడం అలవాటు. ఇక ఆవిడ కంటారా...ఆవిడ కోపం అంటే ఏమిటో ఎరగదు కానీ చలపతిఇటువంటి కబుర్లు చెప్పినప్పుడు ఆవిడకోపం కాస్త దుఃఖంగా మారిపోతూ ఉంటుంది. దాంతో వాపోతుంది. అదేమిటో కానీ ఆవిడ గారి కన్నీ వింతలే. కారణం ఆవిడ ప్రపంచం ఎంత సేపూ భర్త, కొడుకు. అంతే. ఆమె ఎక్కడికీ వెళ్ళదు. సాధారణంగా ఎవరూ వారింటికి రారు.

చలపతి కందుకే కోపం. అలా తల్లి ఎవరింటి కైనా వెళితే, వాళ్ళు తమింటి కొస్తే వాళ్ళ పిల్లల్నెవరినైనా తను ప్రేమించవచ్చును కదా. ఆ అవకాశం కాస్త లేకపోయిందే అని తల్లికి స్నేహితురాళ్ళు లేనందుకు కోపగించుకుంటూ ఉంటాడు.

చలపతి తల్లితండ్రులకు ఒక్కగా నొక్క బిడ్డ. దాంతో అతనికి మరింత కోపం కలుగుతూ ఉంటుంది. ఒక చెల్లెల్ని కని ఉండకూడదా అని.

"అబ్బో, పిచ్చినాయన. వీడికి చెల్లెలంటే ఎంత ప్రేమ" అని మురిసిపోతూ ఉంటుంది చెల్లెల్ని కనని వాళ్ళమ్మ.

కానీ చలపతి నిఘంటువులో చెల్లెలు అంటే చెల్లెలి స్నేహితురాళ్ళు అని అర్థం. అలా చెల్లెలి కోసం వచ్చే స్నేహితురాళ్ళలో ఒకరి నైనా ప్రేమించ గలిగి ఉండేవాడిని కదా అని వాపోతూ ఉంటాడు చలపతి. ఈ వాపోవడం అన్నది వాళ్ళమ్మ దగ్గర నుంచి పుణికి పుచ్చుకున్న గుణం అని ఎగతాళి చేస్తూంటాడు చలపతి నాన్న.

చలపతి ఇంటికి అసలు ఎవరూ రారన్నది అంత నిజం కాదు. అప్పుడప్పుడు బంధువులు వస్తూ పోతూ ఉంటారు. వాళ్ళలో అతడు పెళ్ళాడడానికి తగిన కన్యలు ఇద్దరో, ముగ్గురో ఉన్నారుకూడా. కాని ఇక్కడే వచ్చింది చిక్కు. చలపతి ఇంటికి ఆ బంధువులంతా రాబందుల్లా కనపడుతూ ఉంటారు. అందుకు వాళ్ళింట్లో దిగారంటే తను సరిగా ఇంటికే రాడు.

అయినా వాళ్ళలో ఒకర్ని పెళ్ళాడేస్తే ఇక అది ప్రేమ పెళ్ళి ఎలా అవుతుంది? జీవితంలో ప్రేమించే పెళ్ళి చేసుకుంటానన్న తన వ్రతం ఏమవుతుంది అలా చేస్తే ప్రేమను అవమానం చేసినట్టు కాదా.

ప్రేమంటే జ్ఞాపకం వచ్చింది. వాళ్ళ బంధువుల్లో 'ప్రేమ' అనే ఒక అమ్మాయికూడా ఉంది. ఆ అమ్మాయి అయితే చలపతికి ఈడూ జోడూ సరిగ్గా ఉంటుందని వాళ్ళమ్మ మురిసి పోతూ ఉంటుంది. ఆ మాటే చలపతితో అందికూడా.

"ఈడంటే సరే. మరీ జోడేమిటమ్మా. సరైన వయసులోని వారు పెళ్ళి చేసుకుంటే వాళ్ళ జోళ్ళు కూడా కుస్తాయా. నా జోళ్ళు మరొకరు వేసుకోవడం నా కిష్టం లేదు ఫో" అని ఘంటాపథంగా చెప్పేశాడు చలపతి.

"అదేమిట్రా, చలపాయ్. నువ్వే ప్రేమని పెళ్ళాడతానన్నావు కదా" అంది వాళ్ళమ్మ.

"అమ్మా. నేను ప్రేమని పెళ్ళి చేసుకుంటా ననలేదు. ప్రేమించి పెళ్ళి చేసుకుంటా నన్నాను" అన్నాడు చలపతి.

"ఏదయితే ఏం రా. ప్రేమలో మాత్రం ప్రేమ లేదూ" అందావిడ అణగి ఉన్న తన తెలివిని ఒలకబోస్తూ. పెళ్ళికి ముందు అంత తెలివిగావనా ఉండేదిట ఆవిడ. ఈ విషయం వాళ్ళ బంధువులు వచ్చినప్పుడల్లా విందుగా వడ్డించిన అన్నంపళ్ళాల ముందో, పొగలు కక్కే కాఫీ కప్పుల ముందో చెబుతూ ఉంటారు.

"నే నన్వేషిస్తున్న ప్రేమలో విందుదనం ఉంది. కాని నువ్వుచెప్పే ప్రేమలో ఏముంది, ఏముందీ" అని సినిమాల్లో సవాలు పాట లాంటిది పాడేసి, అర్జెంటుగా టైం చూసుకుని 'బాబోయ్ తొమ్మిదిన్నర' అనుకుని బయటకు పరుగెత్తాడు చలపతి.

• • • •

అలా వంటింట్లోంచి అర్జంటుగా బయట పడిన చలపతి బస్టాండుకు చేరుకున్నాడు అఘమేఘాలమీద.

'హమ్మయ్య! వారం రోజుల నుంచి కనిపించని సుందరి ఇవాళ కనిపించింది' అనుకున్నాడు. అస లా అమ్మాయి కోపమే అంత హడావుడిగా బయట పడ్డాడు చలపతి.

చలపతి ఒక మంచి కంపెనీలో ఎనిమిదొందల జీతానికి ఉద్యోగం చేస్తున్నాడు. సొంత కొంప, సంపాదించే తండ్రి ఉన్నందువల్ల అతగా డింట్లో ఇచ్చాడా లేదా అని అడిగేవాళ్ళు లేరు. కాని తన సంపాదన కొళ్ళ బట్టలకి, స్నో పౌడర్లకి, సెంటు సీసాలకి చాలడం లేదని సహజ రీతిలో వాపోతూ 'పేరైజ్'కోసం యూనియన్ని సమర్థిస్తాడు చలపతి.

ఆ. అన్నట్టు సుందరి గురించి చెప్పుకుంటున్నాం. ఆ సుందరి అసలు పేరు ఏమిటో చలపతికి తెలియదు. కాని తాత్కాలికంగా 'సుందరి' అని పేరేట్టుకున్నాడు. ఆర్నెల్లుగా ఆ బస్టాండులో తొమ్మిదీముప్పై ఐదుకు చూస్తున్నాడు సుందరిని. బస్సులో ఆమెతోపాటే ఎక్కుతాడు. నెల రోజులుగా తన స్టాపింగ్ కన్నా రెండు స్టాపింగుల ముందు దిగి, ఆమెని వాళ్ళాఫీసు వద్ద దిగవిడిచి తనాఫీసుకు నడిచి పోవడం అలవాటు చేసుకున్నాడు. సుందరి తనని కసరకపోవడమే ఒక విజయంగా భావించి, ఎప్పటికైనా తనని వరించిందా అని ఎదురు చూస్తున్నాడు చకోరా పక్షిలా చలపాయ్.

అటువంటి సుందరి వారం రోజులనుంచి కనిపించక పోవడంతో దిగులు పట్టుకుంది చలపతికి. పాపం జ్వరం వచ్చిందేమో. కిటికీలోంచైనా చూసొద్దామంటే వాళ్ళిల్లు తెలీదాయె. వాళ్ళిలెలా తెలుసుకోవడం. ఆ అమ్మాయి నెలా చూడడం? అని మథన పడుతూంటే ఈ ప్రశ్నలకి సమాధానంలా సుందరే కనిపించింది.

అందుకే 'హమ్మయ్య' అనుకున్నాడు సుందరి కనపడగానే. ఇంతలో బస్సు కాస్త వచ్చేసింది. సుందరి, ఆమెతోపాటు చాలామంది బస్సెక్కారు. కదలబోతున్న బస్సులోకి కవిమ్మా పుచ్చుకుని జొర బడ్డాడు చలపతి, అవాళ్టితో సుందరి నడిగెయ్యా లన్న దృఢ నిశ్చయంతో.

సుందరి కూర్చున్న వైపు చూశాడు. అప్పుడే సుందరి వెనక్కి తిరిగి కిసుక్కున నవ్వింది. ఒళ్ళంతా చక్కిలిగింతలు పెట్టినట్లయింది చలపతికి. 'అబ్బ... ఇన్నాళ్ళకి తనమీద దయ కలిగింది కదా' అనుకుని టిక్కెట్టడుగుతున్న కండక్టర్ మీద విసుక్కుని టిక్కెట్ కొనుక్కుని ముందుకు వచ్చాడు చలపతి.



తీరా, వచ్చేసరికి సుందరి కూర్చున్న స్థలానికి పక్కగా ఒక భారీ యువకుడు నిలుచుని ఉన్నాడు. ఎంతకీ కదలడే. అతనడ్డంగా ఉండడంతో సుందరి సరిగ్గా కనపడడం లేదు చలపతికి. తిట్టుకున్నాడు. అతడు జరుగుతాడేమోనని చూశాడు. వుహూ. లాభం లేక పోయింది.

ఇంతలో సుందరి దిగవలసిన స్టాపింగ్ కాస్తా వచ్చేసింది. కంగారు పడ్డాడు చలపతి. "తప్పుకోండి, తప్పుకోండి" అని అరిచాడు. సుందరి గమనిస్తుందేమోనని చూశాడు. తలొంచుకుని బస్సు దిగింది సుందరి. ఆ వెనకే ఎలాగోలా తనూ దిగాడు చలపతి.

'ఇవాళ చెప్పెయ్యాలి తన మనసులోని మాట' అనుకున్నాడు. సుందరి వెనక్కి తిరిగి చూసింది. అప్రయత్నంగా వెనుదిరిగాడు చలపతి. బస్సులోని భారీ శాల్తీ వడివడిగా అడుగులు వేసుకుంటూ వస్తున్నాడు.

సుందరి అతని వైపే చూస్తోంది. కోపంగా సుందరి వైపు చూడబోయిన చలపతికి కళ్ళు తిరిగి నంత పనైంది.

'ఇంకా నయం. తను చెప్పెయ్య లేదు. ఆమె చెప్పు విసిరి ఉండేది తన మీద' అనుకున్నాడు.

ఆ యువకుడు సుందరి చెయ్యి పట్టుకుని నడుస్తున్నాడు. సుందరి మెడలో మంగళసూత్రం!

"అతడే పాపం—రోజూ నన్ను ఆఫీసు దగ్గర జాగ్రత్తగా దించి వెళుతూ ఉంటాడని చెప్పానే. బాడీగార్డ్ లాగా" అంటూంది సుందరి ఆంగ్లంలో. ఆ భారీ యువకుడు వెనక్కి తిరిగి తనని చూసి నవ్వుతున్నాడు.

చలపతి ఈ అవమానం భరించలేకపోయాడు.

ఆఫీసులో కూర్చున్నాడన్న మాటే కానీ అతడి కళ్ళ ముందు ఆ దృశ్యమే మెదులుతూంది—చెవులకి 'బాడీగార్డ్' అన్న మాటే వినిపిస్తోంది.

రెండు చేతుల మధ్య తల పెట్టు క్కూర్చున్న చలపతిని చూసి కొలీగ్ రంగారావు జాలి పడ్డాడు. రంగారావుకి చలపతి కథ కొంతవరకు తెలుసు.

"బ్రదర్...అందుకే ఈ వెధవ ప్రేమ లొద్దన్నది. ఇదెన్నవది? నూటపాతిక కదూ..."

"కాదు. నూటడెబ్బై అయిదు" అన్నాడు నీరసంగా చలపతి.

"రజతోత్సవ మన్న మాట. భేష్! అయినా నీకీ గొడవ లెందుకు చెప్పు—హాయిగా కట్నకాంతని పెళ్ళాడక. అలాగయితే ఇంటా వంటాకూడా సుఖం కదా. నాకు తెలియ కడుగుతాను. ప్రేమలో ఏముందని..." అన్నాడు రంగారావు.

"విషాదముంది.విషముంది..." విసుగ్గా అరిచాడు చలపతి, నన్నొంటరిగా వదిలెయ్ అన్నట్లు చూస్తూ.

క్షణంలోనే తీర్మానించుకున్నాడు కొంత కాలం వరకు ఎవర్నీ ప్రేమించకూడదని, రెండు బస్సులు మారడమైనా సరే, రూటు మార్చాలనీను.

కానీ మనిషి బుద్ధి ఉంది చూశారూ—అసలు అంతెందుకు—డార్విన్ సిద్ధాంతం ఇలాటప్పుడే నమ్మబుద్దేస్తుంది. మనిషి బుద్ధేం ఖర్మ— మనిషే కోతికి ప్రతిరూపం అని... లేకుంటే ఏమిటి... నిర్ణయం తీసుకుని నాలుగ్గంటలు కాలేదు... అప్పుడే ప్రేమలో పడతాడా చలపతి!

'ఇది ప్రేమ కాదు. ఆకర్షణ— అంతే' అని అంతరాత్మని చంపబోయాడు చలపతి.

ఆ అమ్మాయి బంగారు తీగలాగా ఉంది. నంబరు నూటడెబ్భైయారు అనుకున్నాడు చలపతి. ఆ సమయంలో ఏం పేరు పెట్టాలో తోచలే దతనికి. ఉన్న మంచి పేర్లన్నీ స్టాకయి పోయాయాయె. తమ ఆఫీసు దగ్గరి బస్టాండులో ఆ సాయంత్రం చూశాడు చలపతి నూటడెబ్భైయారుని. అప్పటికే చాలామంది ఆ అమ్మాయి వైపు చూస్తూ ఇద్దై పోతున్నారు. చలపతి అసలు ఆ అమ్మాయిని పట్టించుకుని ఉండేవాడు కాదు. యూథాలాపంగా చూశా డంతే.

యాదృచ్ఛికమే కావచ్చు కానీ,ఆ అమ్మాయికూడా సరిగ్గా అతనికేసి చూడాలా...కళ్ళూ కళ్ళూ కలవాలా!

ఇంకేముంది... చలపతి తన శపథం, నిర్ణయం అన్నీ మరిచి పోయాడు. ఆ అమ్మాయికి కాస్త దగ్గిరగా జరిగాడు. మరీ పసిమి కాకపోయినా పసిమి అనేచెప్పవచ్చును.మరీ గుండ్రటి మొహంకాకపోయినా గుండ్రమనే అనుకోవచ్చు. మరీ నాగరికం కాకపోయినా నాగరిక యువతి అనే అనుకోవచ్చు. ఇలా తనకు కావలసిన లక్షణాలన్నీకూడా ఆ అమ్మాయిలో ఉన్నా, లేకపోయినా ఉన్నాయనుకున్నాడు.

అయితే ఇంతవరకు ఇతరులలో కనిపించని కొన్ని లక్షణాలు ఆ అమ్మాయిలో కనిపించాయి చలపతికి. (ఇక్కడ ఒక్క మనవి: చలపతి దృష్టిలో 'ఇతరులు' అంటే తను అంతకు ముందు ప్రేమించిన నూట

డెబ్బై అయిదు మంది అని అర్థం ). ఆ నూటడెబ్బై అయిదు మందిలో కాలేజీ పిల్లలున్నారు (క్షమించాలి. కొంతప్పుడు స్కూలు పిల్లలు కూడా కాలేజీ పిల్లలని పొరపడి చలపతి ప్రేమించిన సందర్భాలున్నాయి. అయితే వారు లెక్కలోకి తీసుకొనబడలేదు ), ఆఫీసు కన్యలున్నారు. ఏమీ తోచక గోళ్ళు గిల్లుకుంటూ కూర్చున్న వారున్నారు. ఇప్పుడీ నూటడెబ్బై యారు ఏ కోవకు చెందిందా అని ఆలోచిస్తూ ఆమెవైపు చూశాడు చలపతి.

అప్పుడే ఆమెలో అతనికి ఇతరులలో కనిపించని కొన్ని లక్షణాలు కనిపించాయి.

ఆ అమ్మాయి దొంగ చూపులు చూడ్డం లేదు. వేలచూపులు చూడ్డం లేదు. చుట్టూ ఉన్న వాళ్ళు తననే చూస్తున్నారన్న భావనే లేదు. ఎవర్నీ లెక్క చెయ్యకుండా ధీమాగా తలెత్తుకుని నిలుచుని ఉంది. ఆమె ధైర్యం చలపతికి నచ్చింది.

ఆమె పెదవులు లేత ఎరుపు రంగులో ఉన్నాయి ( లిప్‌స్టిక్! ). కనుబొమలు తీర్చి దిద్దినట్లున్నాయ్ ( ట్రిమ్మింగ్ ). బుగ్గమీద పుట్టుమచ్చ. అసలు ఆమెకి అదే అందాన్నిస్తొంది. ఈ సారి ఆ అమ్మాయి గాగుల్స్ తీసి అందరి వైపూ చూసింది. చలపతి నిలుచున్న వైపు చూసి నవ్వీనవ్వనట్లు నవ్వింది. చలపతి వెనక్కి తిరిగి చూశాడు. వెనక చాలా మందే నిలుచుని ఉన్నారు. మరి ఎవర్ని చూసి నవ్వినట్లు?

అది తేల్చుకునే లోపల ఆమె ఎక్కవలసిన బస్సు కాస్తా వచ్చింది. చాలా బుద్ధిమంతుల్లా అందరూ తప్పుకుని ఆ అమ్మాయి ఎక్కడానికి తావు ఇచ్చారు. అది చూసి కొందరు వయసు పెద్దవాళ్ళు 'ఆహా... ఒక్కో బస్టాండులోనూ ట్రాఫిక్ సిబ్బందికి బదులుగా ఇలా వో అందమైన అమ్మాయిని పెడితే ఎంత బాసున్ను. క్యూ ఎలా ఫారమ్ అయిందో చూశారా' అని మురిసిపోతున్నారు. కాని వాళ్ళ ఆనందం క్షణంలోనే అడుగంటింది. మురిసిన మొహాలు ముకుళించుకు పోయాయ్. కారణం—ఆ పిల్ల బస్సెక్కిన మరుక్షణం వారు బెల్లం చుట్టూ మూగే ఈగల్లా బస్సు చుట్టూ మూగి కడ్డీ పట్టుకుని వూగిసలాడుతూండగా బస్సు కదిలింది.

బయట ఉండిపోయిన వాళ్ళలో చలపతి ఒకడు. 'డామిట్! బస్సు మిస్సయిపోయింది' అనుకున్నాడు. అంతలోనే నవ్వొచ్చి 'బస్ మిస్ అయిపోవడమేమిటి ... మిస్ బస్‌లో వెళ్ళిపోయింది' అనుకున్నాడు.

ఆ రాత్రి ...


'తనెక్కవలసిన బస్సు ఒక జీవిత కాలం లేటు' అని చదివాడు ఆరుద్ర పుస్తకంలోంచి చలపతి. అంతలోనే పుస్తకం మూసేసి 'వీల్లేదు' అని అరిచాడు.

"ఏమిట్రా అది...అన్నం నీళ్ళు లేకుండా రాగానే అలా మంచం మీద పడుకున్నావ్" అంది వాళ్ళమ్మ చలపతి వాలకం గమనిస్తున్నదై.

"అన్నం వద్దు ... నా కాకలిగా లేదు ... నీళ్ళు పట్రా" అన్నాడు చలపతి.

చలపతి వాళ్ళమ్మకి తెలుసు, అటువంటి మూడ్‌లో పలకరించినా చలపతి పలకడని. అందుకే అక్కడి నుంచి వెళ్ళిపోయా రావిడ.

హాల్లో చలపతి నాన్నగారు "ఏమంటాడు నీ




పుత్రుడు" అని అడుగుతున్నారు.

"ఏమిటో ... ఇంటికి వచ్చినప్పటి నుంచి వాడి వాలకం ... అప్పుడప్పుడుంటుందే ... అలా ఉంది ... అదోలా... ఆకలి లేదు—మంచి నీళ్ళిమ్మన్నాడు" అం దావిడ.

"ఇది మన కలవాటేగా. మళ్ళా ఏ భంగపాటో కలిగి ఉంటుంది. ఆ తాపం చల్లారడానికి నీళ్ళడిగి ఉంటాడు. పోన్లే పాపం--వీడి పుణ్యాన అని వీడు చూసిన వాళ్ళందరికీ పెళ్ళిళ్ళయి పోతున్నాయి" అని పరాచిక మాడాడు ఆయన.

"చాల్లెండి మీరు మరీను" అంటోంది చలపతి తల్లి.

ఆ మాటలు వింటున్నాడు చలపతి. 'హూఁ... చివరికి కన్న వాళ్ళకి కూడా లోకువై పోయానా' అనుకున్నాడు. ఎలాగైనా నూట డెబ్బైయారుని ప్రేమించి పెళ్ళి చేసుకో దల్చుకున్నాడు. ఆ అమ్మాయి కాకపోతే ఇక జీవితంలో పెళ్ళే చేసుకోకూడ దనుకున్నాడు. ఇది ఉత్తుత్తి శపథం కాదని కూడా అనుకున్నాడు.

అలా ఆలోచిస్తూ ఉండగా ఆ అమ్మాయిని ఎక్కడో చూసిన ట్లనిపించింది చలపతికి. ఎవర్నైనా ఒకసారి చూస్తే ఇట్టే గుర్తు పట్టెయ్యగలడు చలపతి. ఆ అమ్మాయి తనంతకుముందు చూసిన నూట డెబ్బై అయిదు మందిలో ఒకర్తె కాదు. తనకి తెలిసిన వారెవరూ కాదు. ఇక బంధువుల్లో— సిటీలో తమకున్న బంధువులు ఇద్దరే. అమ్మ మొత్తుకునే ప్రేమ ... మరొక నాణె ...వాణి నల్ల మొద్దు. ఇక ప్రేమ...ఆ పిల్లని తను చూసింది రెండు మూడు సార్లే. వాళ్ళొచ్చి సంవత్సరం కూడా కాలేదు.

'కొంపదీసి ప్రేమ అయి ఉంటుందేమిటి?'—ఈ ఆలోచన రాగానే మనోపథంలోకి నూట డెబ్బైయారుని రప్పించాడు. పక్కనే ప్రేమను ప్రతిష్ఠించాడు. చ ... నక్కకీ నాగలోకానికీ గల పోలిక' అనుకున్నాడు సంతృప్తిగా. ప్రేమను చెరిపేశాడు. నూట డెబ్బైయారు గుణించాడు.

'తను నూట డెబ్బైయారుని ప్రేమిస్తున్నాడు. ఇది ఆకర్షణ కాదు' అనుకున్న తర్వాత గానీ అతని కా రాత్రి గాఢ నిద్ర పట్టలేదు.

• • • •

మర్నాడు ఉదయం హుషారుగా లేచాడు చలపతి. ఆ హుషారు క్కారణం అతడి కో మధుర స్వప్నం రావడమే. ఆ మధుర స్వప్నం తలచుకున్న చలపతికి నూట డెబ్బైయారన్న పేరు నచ్చలేదు. అదేదో ఖైదీ నంబర్లా ... పోలీసు కానిస్టేబుల్ని ఎస్. ఐ. పిలిచినట్లుగానూ ఉంది. దాంతో తన మధురస్వప్నానికి చిహ్నంగా 'స్వప్న' అని పేరెట్టుకున్నాడు.


రాత్రంతా దిగాలుగా ఉన్న కుమారరత్నం బాత్‌రూమ్‌లో ఈలపాట పాడుకుంటూ, మధ్యలో 'స్వప్న ... స్వప్న' అంటూ ఉంటే ఆశ్చర్యంతో ముక్కున వేలేసుకుంది సదరు కుమారరత్నం మాతృమూర్తి.

స్నానం చేసిన తర్వాత దేవుడికి దణ్ణం పెట్టుకుంటుంటే అనుమానం వచ్చింది చలపతి మీద అతని తండ్రికి. 'మరో కన్యారత్నానికి పెళ్ళియోగం పట్టేసింది మరి' అనుకున్నారు.

తెల్లటి దుస్తుల్లో ముస్తాబైన చలపతికి దారి పొడుగునా సందేహాలే. 'నిన్న సాయంత్రం ఆఫీసుదగ్గర కన్పించిన స్వప్న మళ్ళీ అక్కడ ఇవాళ కన్పిస్తుందా... అసలు బస్సెక్క డెక్కుతుంది... అసలు రోజూ అక్కడ బస్సు ఎక్కుతుందా? ఎక్కదా? అయినా సాయంత్రం వరకు తన మల్లె పువ్వు దుస్తులు అలాగే ఉంటాయా? నలిగిపోతాయా?' ఇలా ఆలోచనల్లో కొట్టుమిట్టాడుతున్న చలపతికి బస్టాండు చేరుకోగానే కళ్ళు మిరుమిట్లు గొల్పాయి.

ఎదురుగా 'స్వప్న'!

తెల్లటి దుస్తుల్లో—అబ్బ... ఎంత అందంగా ఉంది. అరె...ఇక్కడి కెలా వచ్చింది? వెధవ ఆలోచనలు అవన్నీ ఎందు కిప్పుడు, తనెప్పుడూ ఇంతే డీవియేట్ అయిపోతూ ఉంటాడు. అలా డీవియేట్ అయిపోయే లైన్లో కొచ్చిన నూటపన్నాలుగు 'రాధిక' నొదిలేసి నూటపదిహేను 'రమ' వైపు దృష్టి సారించాడు. అంతే. అదే తను చేసిన పెద్ద తప్పు. ఫలించబోయిన




ఒక్కటీ కాస్త ఫలించకుండా పోయింది. అప్పటి నుంచీ ఇప్పటి దాకా... ఇలా... సరే! అదెందుకు లెండిప్పుడు.

స్వప్న తెలంటి పోసుకు వచ్చినట్లుంది. జుత్తు పాయలు అల్లుకోకుండా విడిచి పెట్టి చివర్న ముడేసుకుంది. దాంతో విడుపాటి ఆమె వీరాలు గాలికి ఎగురుతూ వింత అందాన్నిస్తున్నాయి. తెల్లటి దుస్తులు—తెల్లటి చెప్పులు. తెల్లటి గాజులు ఒక చేతికి,మరో చేతికి తెల్లటి స్ట్రాప్‌తో రిస్ట్‌వాచీ... వీటన్నిటినీ మించి తెల్లటి మల్లెపువ్వులు తలలో తురుముకుంది—కొంప దీసి తెల్లటి లిప్‌స్టిక్ వేసుకో లేదు కదా అని ముందుకు వచ్చి తొంగి చూశాడు ఓరకంట్లితో చలపతి.

సరిగ్గా అదే సమయంలో కొద్ది దూరంలో నిలుచున్న నూటడెబ్బై ఐదు 'సుందరి' అతని వైపు చూసింది. ఆమె చూపుల్లో ఒకింత అసూయ, పరాభవం తొంగి చూసినట్లనిపించింది చలపతికి. గర్వంగా చూసి స్వప్న కి మరింత దగ్గిరగా వచ్చాడు చలపతి. సుందరి కోపంతో మొహం తిప్పుకుంది. కోపంతో తిప్పుకుందో లేదో కాని అలా అనుకున్నాడు చలపతి. స్వప్న అతని వైపు చూసీ చూడనట్లు చూసింది.

రణగొణ ధ్వని చేస్తూ బస్సు కాస్త దాని స్పీడ్ కది రానే వచ్చింది. సుందరి బస్సు ఎక్కుతూ వో సారి వెనక్కి తిరిగి చలపతి వైపు చూసింది. ఇవాళ మొగుడు వెంట లేడు. 'ఎందుకలా చూసింది చెప్మా' అనుకుని అంతలోనే మనసు డీవియేట్ అయిపో తోందని గ్రహించిన వాడై 'చపలాయ్... పరాయిస్త్రీ అందులో ఆజన్మాంతం ఒకరి కంకితమై పోయింది తల్లితో సమానంరా' అని తన్ను తాను మందలించు కున్నాడు.

ఈ మందలింపు కార్యక్రమంలో స్వప్న కాస్త బస్సెక్కేసింది. హడావిడిగా చలపతి కూడా బస్సులోకి జొరబడి అటూ ఇటూ చూసి ముందు సీట్లో కూర్చున్న స్వప్నని చూసి 'ఎక్స్‌క్యూజు మీ' అంటూ జనాన్ని తోసుకుని ముందుకు జొరబడ్డాడు.

స్వప్న బస్సులో అటూ ఇటూ చూసి సన్న లేత పెదవుల నో సారి మునిపంటితో కొరుక్కుని చలపతికేసి యాధాలాపంగా చూసింది. చలపతి రెండంగుళాలు పెరిగినంతై బస్సు టాప్‌కి కొట్టుకుని 'అమ్మా' అన్నాడు బొప్పి తడుముకుంటూ.

సడన్ బ్రేక్ వేసిన డ్రైవర్ ఎదురుగా వచ్చిన ఎద్దుల బండి వాణ్ణి తిడుతున్నాడు.

"ఈ కార్ట్ పుల్లర్స్‌తో వచ్చిన చిక్కే ఇదండి. పీక్ అవర్స్‌లో వై షుడ్ దె కమ్...ఇలా... టెల్ మి... చెప్పండి ... కమాన్" అన్నాడు పక్కనున్న ఆంగ్లాంధ్రుడు.

చలపతికి ఒళ్ళు మండుకొచ్చింది. 'ఇదెక్కడి గోలరా బాబూ ... హాయిగా కనులతో క్లోజప్‌లో 'స్వప్న' అందా న్నాస్వాదిస్తుంటే' అనుకుని "టెల్ మి అంటే నేనేం చెప్పనండి. అది ట్రాఫిక్ డిపార్ట్‌మెంట్ వాళ్ళ నడగం డంతే" అన్నాడు కాస్త విసుగ్గా.

ఆ పెద్ద మనిషి అంత త్వరగా విడిచిపెడతాడా... ఇహ లాభం లేదనుకుని "మీరు చెప్పింది నిజమే నండోయ్. భలేవారండి—అహ...మీరుమరీనూ"అని అసందర్భంగా ప్రేలి, ప్రస్తుతానికి తల దాచు కునేందుకు వో భారీ శాల్తీ వెనక్కి నక్కాడు చలపతి.

కిసుక్కున నవ్వింది స్వప్న. నవ్వడమే కాదు. అతని వైపు చూసిందికూడా. ఆ తరవాత నవ్వుతూనే మొహం కిటికీ వైపు తిప్పుకుంది.

'అరె ... స్వప్నకి తమ సంభాషణ అర్థమైంది. అంటే స్వప్న తెలుగు అమ్మాయ్. ఆ ఆంగ్లాంధ్రుడు చేసిన హెల్ప్ సహాయానికి వెయ్యి కొబ్బరికాయలు కొట్టాలనిపించింది ఆ క్షణంలో చలపతికి. అంత వరకు అతను ప్రేమించిన వారు — ఆంధ్రులో, అరవలో, గుజరాతీలో, కన్నడిగులో అతనికి తెలియదు.

స్టాపింగొచ్చింది. అందరితోపాటే స్వప్న దిగింది. కాస్త ఆలస్యంగా బస్ లోంచి దిగాడు చలపతి. ఆమె ఎక్కడికి వెళుతూందోతెలుసుకోవాలని చలపతిఆత్రత. 'కల్చరల్ అకాడమీ' అని రాసి ఉన్న బోర్డు చూశాడు చలపతి. అందులోకే స్వప్న వెళుతోంది.

అటుగా వెళుతున్న వో పెద్దమనిషిని "అక్కడేం నేర్పిస్తారండీ" అనడిగాడు చలపతి.

"హోమ్ మేకింగ్ కోర్సులు" అన్నా డాయన.

"అంటే గృహ నిర్మాణ మాండీ" అన్నాడు అమాయకంగా చలపతి. ఆ పెద్దమనిషి క్కాస్త కోపం వచ్చింది. "ఇంటి విషయాల్లో తర్ఫీదు ఇస్తారయ్యా" అని విసవిసా నడుచుకుంటూ వెళ్ళి పోయాడు.

● ● ●

ఆ రోజు ఆఫీసులో చలపతి కొలీగ్ రంగారావుతో వాదనకి దిగాడు. "అసలు ఇల్లాలు అంటే ఎవరు? ఇంటికి దీపం కదా. ఆ ఇంటికి దీపం ఎలా ఉండాలి? ఇక్కగా ఇల్లు దిద్దుకుంటూ, భర్త ఆఫీసునుంచి రాగానే కాఫీ కప్పుతో ప్రత్యక్షమై తన ప్రత్యేకత నిలుపుకోవాలి. అంతేకానీ తగుదునమ్మా అని తనూ ఉద్యోగాలు చేసి అలిసిపోయి వచ్చిన భర్త ముందు తను అలిసిపోయినట్లు కూలబడటం కాదు" అంటూ ప్రారంభించాడు.

"అదేమిట్రా, చలపతీ...నువ్వే కదా ఆ మధ్య 'ఉద్యోగం చేస్తున్న భార్యఅయితే మంచిది. వేన్నీళ్ళు... చన్నీళ్ళు... కష్టాలు... సుఖాలు పాలు పంచుకోవ డాలూ' అన్నావు" అన్నాడు రంగారావు విస్తుపోయి చూస్తూ.

"అందుకే నీతో మాట్లాడటమంటే నాకు చచ్చే చిరాకు. నిన్నటి ప్రపంచం నేడుందా? ఎంతో ముందంజ వేస్తూందది! మనమూఅంతే. ఆలోచనల్లో మార్పు రావాలి. అప్పుడే అభివృద్ధి. అన్నట్టు నీకు హోమ్ మేకింగ్ కోర్సంటే తెలుసా?" అనడిగాడు తెల్లబోయి చూస్తున్న రంగారావును.

● ● ● ●

ఆ సాయంత్రం...అలా ఆయిదారు సాయంత్రాలు వగళ్ళు 'స్వప్న'తో పాటే బస్సెక్కాడు, దిగాడు చలపతి. అయితే ఆ రోజు...

'స్వప్న' బస్టాండులో నిలుచుని ఉంది. చలపతి అంతకు ముందు నుంచే అక్కడ పడిగాపులు పడి ఉన్నాడు. పదింటికి ఆఫీసయితే తొమ్మిదింటికే బస్టాండులో ఉంటున్నా డీ మధ్య.

'స్వప్న' కంగారుగా బ్యాగ్ వెతుక్కుంటూంది. చలపతి ఆమె వైపు ఆత్రుతతో చూస్తున్నాడు.

ఇంతలో 'హమ్మయ్య' అనుకుంది. అనుకోవ డంతో పూరుకోక పెద్ద రిలీఫ్ పొందిన దానిలా చలపతి వైపు చూసింది.

"ఏమైందండీ" అనడిగాడు చలపతి ఏమైతే అయిందని ధైర్యం చేసి.

"పర్స్ బ్యాగ్‌లో ఉంచానో లేదోనని సందేహం వచ్చింది. ఉంది లెండి" అంది.

"ఉందా?" నీరు కారిపోయాడు చలపతి. లేకపోతే సాయం చేసి సాయంత్రం పార్కులో డ్యూయెట్ పాడదామనుకున్నాడు చలపతి.

"ఉందండి" అంది 'స్వప్న' ఓపిగ్గా.

ఇంకేం మాట్లాడాలో తోచలేదు చలపతికి. విడ్డూరం. బస్టాండులో ఆ రోజు అట్టే జనం కూడా లేరు. ఈ అవకాశం మళ్ళీ రాకపోవచ్చు. 'మంచి సమయం మించిన దొరకదు' వంటివి




నల్లో వేసుకుంటూ—

"ఏమండీ" అన్నాడు చలపతి.

'ఏమి టన్నట్లు' చూసింది 'స్వప్న'.

"ఒక వేళ పర్సు కనిపించకపోతే ఏం చేసేవారండీ?" అనడిగాడు చలపతి మాట కలుపుతూ.

"నిజమేనండి. గట్టే ఎక్కే వచ్చేది. నే నిక్కడికి బస్సు మారి వచ్చాను. వెనక్కి మా ఇంటికి వెళ్ళాలన్నా దూరమే. అయినా ముఖపరిచయమున్నవాళ్లైన మీ లాంటి వా ళ్లెవర్నన్నా అడిగినా ఇస్తారు కదండి. అడగడానికి సిగ్గు పడతాం కానీ" అంది 'స్వప్న'.

"అరె... నా అభిప్రాయంకూడా అదేనండి" అన్నాడు చలపతి ఆశ్చర్యం నటిస్తూ.

బస్టాండు ఖాళీగా ఉండడంతో బస్సుకూడా ఒక మోస్తరు ఖాళీగానే ఉంది. 'స్వప్న' కూర్చుంది. ఆమె పక్కన స్థలం మాత్రమే ఖాళీగా ఉంది. బస్సులో ఒక్క చలపతి మాత్రమే నిలుచుని ఉన్నాడు. అది చూసి 'స్వప్న' చలపతితో "కూర్చోండి" అంది పక్కకి జరుగుతూ.

చలపతి సందేహించాడు. అంతలోనే మరో శాల్తీ అటుగా రావడం చూచి గాభరాగా కూర్చున్నాడు.

"ఇక్కడ ఇలా కూర్చోవడానికి సంశయిస్తారా... బొంబాయిలో అలా కాదండి. అస లీ రిజర్వేషన్లే లేవక్కడ. అయినా అమ్మాయిలూ, అబ్బాయిలూ కలిసి చదువుకో వచ్చును. కలిసి ఉద్యోగాలు చెయ్య వచ్చును. కానీ బస్సులో కలిసి కూర్చుని ప్రయాణం చెయ్యకూడదా? లవు సిల్లీ" అంది స్వప్న.

"అరె...సరిగ్గా నా అభిప్రాయంకూడా అదే నండీ" అన్నాడు చలపతి.

'స్వప్న' నవ్వింది. చలపతే ఇద్దరికీ టిక్కెట్లు కొన్నాడు.

"అరె—అదేమిటండీ" అని అడ్డు పడబోయింది 'స్వప్న'.

"కాస్సేపు మీ 'పర్సు' కనిపించ లేదనుకోండి" అన్నాడు చలపతి తనలో ఇంత 'సెన్సాఫ్ హ్యూమర్' ఉందా అని ఆశ్చర్యపోతూ.

'స్వప్న' పకపకా నవ్వింది. "మీతో మాట్లాడు తూంటే ఎవరో ఆత్మీయులతో మాట్లాడుతున్న ట్టుంది. మరోవిధంగా భావించకండి. మనసులో ఉన్నది దాచుకోకుండా చెప్పడం నాకు అలవాటు" అంది.

"నేను అంతేనండి. నాకు హిపోక్రైట్స్ అంటే మంట! అరె...ఇలా మన అభిప్రాయాలు కలిసి పోతూ ఉండడం ఆశ్చర్యంగా లేదండీ—అన్నట్టు నా పేరు చలపతి. నేను ఫలానా సంస్థలో పని చేస్తున్నాను" అన్నాడు తనని తాను పరిచయం చేసుకుంటూ.

'స్వప్న' నవ్వి వూరుకుంది. వాళ్ళు దిగాల్సిన స్టాపింగ్ వచ్చేస్తోంది. 'ఆ అమ్మాయి గురించి తెలుసుకోవాలి' కొట్టుకుంటోంది చలపతి హృదయం.

"మీ... మీ... మీ గురించి..."

"మీకేం తెలియదా?" కొంటెగా చూస్తూ అడిగింది స్వప్న.

తబ్బిబ్బయ్యాడు చలపతి. "మీరు కల్చరల్ అకాడమీలో హోమ్ మేకింగ్ కోర్స్ చేస్తున్నారు. కాని మీ పేరు ..." నసిగాడు.

"మా నాన్నగారు ఉద్యోగ రీత్యా బొంబాయిలో ఉన్నారు. మా అమ్మ అక్కడే ఉంది. నే నిక్కడ అన్నగా రింట్లో ఉంటున్నాను. అరె...స్టాపింగ్ వచ్చే సిందే" అంటూ లేచి నిల్చుంది.

చలపతి గొంతు ఎండిపోతోంది. "మీ పేరు?"

"స్వప్న ... స్వప్నసుందరి" అంది స్వప్న.

ఉలిక్కిపడ్డాడు చలపతి. కళ్ళు నులుముకుని చూశాడు. రోడ్డు దాటి వెళ్ళిపోతోంది స్వప్న. ఆనం దంతో ఎగిరి గంతెయ్యా లనిపించింది చలపతికి ఆ క్షణంలో.

● ● ● ●

ఆ తరవాత అలా అలా వారి పరిచయం పెరిగి పెద్దదై పార్కులలోకి, బీచి ఒడ్డుకి విస్తరించింది. ఆర్నెల్లు గడిచిపోయాయ్. ఒక రోజు ...

"మన జీవితం మూడు పువ్వులు ... ఆరు కాయలు కావాలి, స్వప్నా" అన్నాడు పార్కులోని గడ్డిమొక్క తుంపుతూ చలపతి.

"మీ మగాళ్ళంతా ఇలాగే అంటారు. మూడూ ఆరూ కలిసి తొమ్మిదైన తర్వాత 'బాబోయ్! నాకేం తెలియు'దని తప్పించుకు పారిపోతారు. మీ మగాళ్ళ గురించి తెలియం దేముంది" అంది నిష్ఠురంగా స్వప్న.

"స్వప్నా ... నే నీ కన్యాయం చెయ్యను. నిన్నే పెళ్ళాడతాను. అయినా అసలు నువ్వు నన్నెన్నడైనా దగ్గరకైనా తీసుకోనిచ్చావా అన్యాయం చెయ్యడానికి" అన్నాడు చలపతి.

"అయితే ఆ కనిపిస్తున్న గుడిలో దేవుడి దగ్గర ప్రమాణం చేసి చెప్పు" అంది స్వప్న. అతడికి దేవుళ్ళన్నా, దయ్యాలన్నా నమ్మకముందని గ్రహిం చేసింది స్వప్న.

గుడిలో—'ఆరు నూరైనా, నూరు ఆరైనా... ఎవరు కాదన్నా ... అస్తి రాదన్నా ... నిన్ను నేను పెళ్ళి చేసుకు తీరతాను" అని స్వప్న చేతిలో చెయ్యేసి చెప్పాడు చలపతి.

తీరా ప్రమాణం చేసిన తర్వాత "మరి మీవా ళ్ళొప్పుకుంటారా?" అని అడిగాడు..

"మా వాళ్ళు నా మాట కాదనరు" అంది గర్వంగా చూస్తూ స్వప్న.

"అయితే మావాళ్ళైనా కాదనేది ... రేపే నిన్ను మా ఇంటికి తీసుకు వెడతాను" అన్నాడు చలపతి.

"నిజం ... అయితే ఓ పని చెయ్యి. రేపు సాయంత్రం మీ ఇంటి దగ్గర బస్టాండులో నీకోసం నిల్చుని ఉంటాను. నువ్వు ఆఫీసునుంచి బస్సు దిగి దిగగానే నన్ను తీసుకు వెళ్ళవుగాని" అంది స్వప్న.

చలపతికి ఈ ఆలోచన నచ్చింది.

మర్నాడు మధ్యాహ్నం ... చలపతికి ఆఫీసులో పనిచెయ్య బుద్ధికాలేదు. దాంతో నాలుగింటికే పర్మి షన్ తీసుకుని బయటపడ్డాడు. సాధారణంగా తను ఆఫీసు నుంచి ఇంటికి చేరుకునే సరికి ఐదున్నర దాటు తుంది. నాలుగే అయింది కాబట్టి ఇంటికి వెళ్ళి మొహం కడుక్కుని తల్లితో ఎక్కడికీ వెళ్ళద్దని చెప్పి బస్టాండుకి ఫ్రెష్‌గా వద్దా మనుకున్నాడు చలపతి.

ఇంట్లోకి అడుగు పెడుతున్న చలపతికి తండ్రి కంఠస్వరం వినిపించింది. గేటు దగ్గరుండగానే 'భేష్ ... ఆయన కూడా ఉన్నా రన్న మాట' అను కున్నాడు. ఇంతలో పెద్ద పెట్టున నవ్వులు విని పించాయి.

'చచ్చాంరా భగవంతుడా... మళ్ళా చుట్టాలా' అనుకుంటూ హాల్లోకి అడుగు పెట్టబోయాడు చలపతి.

'అంతే ... అతని అడుగు ముందుకు పడలేదు. స్థాణువులా నిల్చుండి పోయాడు. గదిలో నవ్వులు తగ్గుస్థాయికి వచ్చాయి.

"త్వరగా తెములు" అంటున్నాడు చలపతితండ్రి.

"ఆ ఇంకా బొట్టంత పైముందిలేమామయ్యా"

"మొత్తం మీద నువ్వు అసాధ్యురాలివే ప్రేమా. మా వాణ్ణి వెర్రి వాగన్నని చేసి ఆడిస్తున్నావు." అంటోంది చలపతి తల్లి.

"అంతా మీ పన్నాగమేగా ... అయినా బావ నన్నెప్పుడూ సరిగ్గా చూడలేదు కాబట్టే సరిపోయింది" అంటూ బుగ్గన గుండ్రటి పుట్టుమచ్చ పెట్టు కుంటోంది ప్రేమ. కాదు. స్వప్న ... కాదు ప్రేమ.

గుమ్మంలో నిల్చున్న చలపతి 'మోసం... దగా... వంచన' అని అరవాలనుకున్నాడు. కానీ అతడి మనసు మొద్దుబారిపోయింది. కంఠం పెగల్లేదు. గుండె మాత్రం ...

'స్వప్న ... ప్రేమ ... స్వప్న ... ప్రేమ ... ప్రేమ ... ప్రేమ' అని కొట్టుకుంటోంది. ★